# నమ్రత

'రామారావు గారి అమ్మాయి మంచిపిల్ల. ఎంతో 'అణకువ!'

"సుబ్బారావుగారి అమ్మాయి చురుకైంది. ఎంతో 'నమ్రత'!"

మన చుట్టూఉన్న సమాజంలో అడపా దడపా విన్పించే ఈ బాపతు కాంప్లిమెంట్లు... ఏ అమ్మాయి వ్యక్తిత్వం ఎలాంటిదో తేట తెల్లం చేస్తాయి !

మొదటి కాంప్లిమెంట్‌ని 'ఇన్సల్ట్'గా, రెండో కాంప్లిమెంట్‌ని 'క్రెడిట్'గా గ్రహించక పోతే సదరు అమ్మాయిలందరూ ఇంకా అమాయకత్వంలోనే ఉన్నట్లు భావించాల్సి ఉంటుంది.

ఎందుకంటే....

'అణకువ' (Submissiveness) లో- ఎంత అణిచివేతకి గురైనా కిక్కురుమనని బానిసత్వ (Slavery) లక్షణం వుంటుంది! ఇలాంటి వ్యక్తులు తమ ఆత్మగౌరవాన్ని 'చంపుకుంటూ', ఎదుటి వాళ్ళ గౌరవాన్ని 'కాపాడా'లని చూస్తారు.

'నమ్రత'(Modesty) ఉట్టిపడే వ్యక్తుల్లో... సౌమ్య స్వభావం, స్వాభిమానం (Self respect) దాగి ఉంటాయి. ఈ తరహా వ్యక్తులు తమ గౌరవాన్ని తాము 'కాపాడుకుంటూ', ఎదుటివాళ్ళపట్ల 'అదరంగా' ఉంటారు.

అణకువ, నమ్రత - రెండూ ఒకటికావు! ఒకదానికొకటి పర్యాయ పదాలుగా వాడే ఆ రెండు పదాల అర్థాల్లో - నిజానికి ఎంతో వైరుధ్యం ఉంది.

పెద్దల పట్ల అధికారుల పట్ల మనం చూపే 'అణకువ'లో... బిడియం, అసహాయత, పిరికితనం, లొంగుబాటుతనం తొంగిచూస్తే: 'నమ్రత'లో... ఆత్మ గౌరవం, వివేచన, ఇతరులపట్ల ఆదరణా ద్యోతకమౌతాయి!

ఇండియాలో పుట్టి, ఇండియాలోనే పెరిగి- అమెరికాలో రెండేళ్ళు చదివి ఇరవై రోజుల కోసం వచ్చే అబ్బాయిలు....

"అబ్బబ్బ ! ఏం డస్ట్ - ఏం పొల్యూషన్! ఈ ఇండియాలో ఇంకా వారం రోజులెలా గడపాలో ఏమో!? ఒరేయ్ చింటూ - ఆ మినరల్ వాటర్ బాటిల్ ఇలా పట్రారా" అంటూ డాంబికాలు ప్రదర్శించినపుడు - వినేవాళ్ళకి చాచి లెంపకాయ కొట్టాలన్నంత కంపరం కలిగితే....

"మా పొరుగింటావిడకి వాళ్ళ అమ్మాయి పీజీ, అబ్బాయి పిహెచ్డీ అని ఎంత టెక్కో? వాళ్ళకే అంత పొగరుంటే - మరి మా అమ్మాయి ఎమ్సెట్‌లో స్టేట్ ఫస్ట్ వచ్చింది... అబ్బాయి యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాడు ! మరి మాకెంత గర్వం ఉండాలి?" అని చెప్పుకునే కబుర్లలో గీర, అతిశయం, భేషజాలు కన్పించి - వినేవాళ్ళకి చిరాకు కల్గుతుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే..... నమ్రత **అంటే హుందాతనం!**

తన స్వశక్తితో ఉన్నత శిఖరాలు అధిరోహించినా - తన విజయానికి కారణం తన స్వయంకృషి ఒక్కటే కాదు - తన సహచరుల సమిష్టి కృషి అని చెప్పుకునే వ్యక్తిలో 'హుందాతనం' ఉట్టిపడుతుంది.

తను హీరో - ఎదుటివాడు జీరో అనుకోవడం 'అతిశయం' (Vanity)

తను హీరో అయినా - జీరోల విలువని విస్మరించకపోవడం - 'నమ్రత' (Modesty)

కార్లూ - బంగళాలూ, అందం, డిగ్రీలూ ఏవీ ఇవ్వలేని 'డిగ్నిటీ'.... మనిషికిచ్చేది... ఆ వ్యక్తి వినమ్రత!

16-3-1997